https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 313 శుక్రవారం 30-1-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

# మేడారం జయహో..

## గద్దెపైకి చేరిన సమ్మక్కతల్లి

- వసం వీడి జనంలోకి వనదేవత..
- చిలుకలగుట్ట వద్ద మంత్రుల ఘన స్వాగతం
- గాల్లోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించిన జిల్లా ఎస్పీ
- జయజయధ్వానాలతో మార్మోగిన అడవి..
- నిన్న పౌరలమ్మ, నేడు సమ్మక్క రాక
- జనసంద్రంగా మారిన మేడారం...
- ఎత్తు బంగారం సమర్పించుకుంటున్న భక్తుల





**మేడారం, జనవరి 29 :** వనం నుంచి జసప్రవాహం దిశగా అడవి తల్లి అడుగులు వేసింది.విశ్వఅరణ్యంలో నిద్రాణమై ఉన్న విప్లవశక్తి, భక్తుల కోలాహలం మధ్య కుంకుమ భరిణి రూపంలో గద్దెపైకి వచ్చింది. గగన తలాన్ని తాకే జయజయ ధ్వానాలు ఒకవైపు..గాల్లోకి పేలిన పోలీసు తుపాకుల గౌరవ వందనం మరొకవైపు.. వెరసి మేడారం మహాజాతర పరాకాష్టకు చేరింది.కుంకుమ వర్ణమై కురిసిన సమ్మక్క తల్లి రాకతో మంచు కొండల వంటి కష్టాలు కరిగిపోతాయన్న భక్త కోటి విశ్వాసం నేడు గద్దెల సాక్షిగా సాక్షాత్కరించింది. కన్నీటి కష్టాలను తుడిచేందుకు,కన్నతల్లిలా దీవించేందుకు సారలమ్మ చెంతకు సమ్మక్క చేరిన ఈ అద్భుత ఘట్టం..యావత్ ఆసియాలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక గిరిజన ప్రతీకగా నిలిచింది.

## ప్రపంచానికి భారత్ ఆశాకిరణం!

**ఈయూతో డీల్ ఉత్పత్తిదారులకు భలే చాన్స్: ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ, జనవరి 29:** భారతదేశం ప్రపంచానికి ఆశాకిరణంగా ఆవిర్భవించిందని ప్రధాని మోదీ అన్నారు. యూరోపియన్ యూనియన్ (ఈయూ)తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్టీఏ).. అన్ని ఒప్పందాలకూ తల్లి వంటిదని.. తమ సామర్థ్యాలు పెంచుకోవడానికి దేశానికి, ఉత్పత్తిదారులకు కూడా మంచి అవకాశం లభించిందని తెలిపారు. కేంద్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో గురువారం పార్లమెంటు ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'సంస్కరణల రథంపై దేశం పరుగులుపెడుతోంది. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తాం. ఇది పార్లమెంటు కార్యకలాపాల స్తంభనకు సమయం కాదు..పరిష్కారాలకు సమయం' అని చెప్పారు. బుధవారం ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగం 140 కోట్ల మంది వ్యక్తీకరించిన అభిప్రాయంగా అభివర్ణించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా 9 బడ్జెట్లు ప్రవేశపెట్టడం భారత పార్లమెంటరీ చరిత్రలోనే గర్వించదగిన విషయమని, ఈ ఘనత సాధించిన తొలి మహిళా ఆర్థిక మంత్రిగా పేరు సంపాదించారని ప్రధాని పేర్కొన్నారు. ఆమె తన 9వ బడ్జెట్‌ను ఆదివారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ 10 సార్లు, మాజీ మంత్రి పి.చిదంబరం 9 సార్లు బడ్జెట్ పెట్టినా.. వరుసగా కాకుండా అప్పుడప్పుడూ ప్రవేశపెట్టారు. కాగా, బడ్జెట్ సమావేశాల ముంగిట మోదీ సందేశం.. ఎప్పటిలాగే కపటత్వంతో కూడుకుని ఉందని కాంగ్రెస్ ఆరోపించింది.

## ఖర్గే, రాహుల్‌లతో థరూర్ భేటీ



**న్యూఢిల్లీ, జనవరి 29:** కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ గురువారం ఆ పార్టీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీలను కలిశారు. పార్లమెంటు భవనంలోని ఖర్గే చాంబర్‌లో ఒక గంటా 45 నిమిషాలకుపైగా ఈ సమావేశం కొనసాగింది.

అనంతరం బయటికి వచ్చిన శశిథరూర్‌ను సమావేశం ఎలా జరిగిందని విలేకరులు ప్రశ్నించగా.. 'అంతా బాగుంది. అందరం ఒకే అభిప్రా యంతో ముందుకు సాగుతున్నాం' అని జవాబి చ్చారు. త్వరలో జరుగనున్న కేరళ అసెంబ్లీ ఎన్నికలకు సీఎం అభ్యర్థి గురించి చర్చించారా? అని ప్రశ్నించగా, 'అది అసలు సమస్యే కాదు. ఏ పదవిపైనా నాకు ఆసక్తి లేదు' అన్నారు. సమావేశంలో ముగ్గురూ చిరునవ్వులు చిందిస్తున్న ఫొటోను శశిథరూర్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

## అజిత్ పవార్ అంత్యక్రియలు పూర్తి

**బారామతి, జనవరి 29:** మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ అంత్యక్రియలు ముగిశాయి. "అజిత్ దాదా.. అమర్ రహే" అంటూ అభిమానులు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. తమ అభిమాన నేతను కడసారి చూసేందుకు వేలాది మంది ఎన్సీపీ కార్యకర్తలు అజిత్ పవార్ అంత్యక్రియలకు తరలివచ్చారు. గురువారం బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ కాలేజీ మైదానంలో అధికారిక లాంఛనాలతో అజిత్ పవార్ అంత్యక్రియలను నిర్వహించారు. ఈ కాలేజీని పవార్ కుటుంబమే స్థాపించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్, ఏపీ మంత్రి లోకేశ్ తదితరులు అంత్యక్రియలకు హాజరయ్యారు. అజిత్ పవార్ కుమారులు పార్థ్, జై చితికి నిప్పంటించారు. కాగా, అజిత్ పవార్ ప్రయాణించిన లియర్‌జెట్-45 విమాన తయారీ సంస్థ బాంబార్డియర్ ప్రమాదంపై స్పందించింది.

ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. దర్యాప్తు ముగిసేంతవరకు ప్రమాదానికి గల కారణం ఏంటనేది చెప్పలేదని పేర్కొంది. దర్యాప్తులో అధికారులకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపింది. బాంబార్డియర్ ప్రధాన కార్యాలయం కెనడాలో ఉంది.

# కేసీఆర్‌కు నోటీసు

## ఫోన్ ట్యాపింగ్ కేసులో నేడు మధ్యాహ్నం విచారణకు రావాలని సిట్ ఆదేశం

**హైదరాబాద్, జనవరి 29** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో విచారణకు సిద్ధంగా ఉండాలంటూ.. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేసింది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ జరుపుతామమని సిట్ ఏసీపీ వెంకటగిరి.. నోటీసులో పేర్కొన్నారు. ఈ నోటీసు కాపీని సిట్ అధికారులు.. నందినగర్‌లోని కేసీఆర్ ఇంటికి వెళ్లి, అక్కడి సిబ్బందికి అందజేశారు. "పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో 2024లో క్రైం నంబర్ 243 కింద నమోదైన క్రిమినల్ కేసు విచారణలో భాగంగా వెల్లడైన అంశాల్లో మీ పాత్రకు సంబంధించి విచారణ జరపాల్సి ఉంది" అని.. 160 సీఆర్‌పీసీ కింద ఇచ్చిన ఈ నోటీసులో దర్యాప్తు అధికారి పేర్కొన్నారు. అయితే, కేసీఆర్ వయసు రీత్యా హైదరాబాద్ పరిధిలో ఆయన కోరిన స్థలంలో దర్యాప్తు అధికారి, ఆయన బృందం విచారణ చేపడతారని, లేదా ఆయన సిట్ కార్యాలయానికి హాజరుకావచ్చని.. ఏ విషయాన్నీ దర్యాప్తు అధికారికి తగు ముందస్తు వ్యవధిలో తెలియజేయాలని నోటీసులో పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు అరెస్టు అయిన పోలీసు అధికారులు.. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు, ఎస్ఐబీ అధికారులు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్నల వాంగ్మూలాల్లో పలుచోట్ల తమకు పైనుంచి ఆదేశాలు వచ్చాయని, పెద్దాయన ఆదేశాల మేరకే ట్యాపింగ్ చేశామని చెప్పారు. నాటీ సీఎంవో గురించి ప్రస్తావించారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావును విచారించినప్పుడు.. తనకు పైనుంచి ఆదేశాలు అందిన విషయాన్ని ఆయన అంగీకరించారు. దీంతో ఆ ఆదేశాలెవరు ఇచ్చారన్న విషయాలను తెలుసుకోవడానికి కేటీఆర్, హరీశ్, సంతోషలను సిట్ అధికారులు ఇటీవల విచారించారు.విచారణలో వారందరూ పేర్కొన్న అంశాలు, తమ అనుమానాలు, దర్యాప్తులో వెలుగుచూసిన విషయాల ఆధారంగా ఇప్పటి వరకూ జరిగిన దర్యాప్తు.. వీటన్నింటిపై సిట్ చీఫ్ వీసీ సజ్జనార్ సమీక్ష నిర్వహించిన తర్వాత, కేసీఆర్‌ను విచారించడానికి సిట్ అధికారులు సిద్ధమయ్యారు. మావోయిస్టుల పేరిట.. విపక్ష నేతలు, వారి కుటుంబసభ్యులతోపాటు, బీఆర్ఎస్ నాయకులు, జర్నలిస్టులు, పారిశ్రామిక వేత్తలు, న్యాయమూర్తులు, సెలబ్రిటీల ఫోన్లను ట్యాపింగ్ చేయించడంతో పాటు వారిపై నిరంతర నిఘా కొనసాగించడానికి ఒకవైపు నిఘా బృందాలను, మరోవైపు టాస్క్‌ఫోర్స్ బృందాలను గత సర్కారు వాడుకుందని నిరూపించే పక్కా అధారాలను సిట్ ఇప్పటికే సేకరించినట్టు సమాచారం! వీరిలో కొందరిపై నిఘా పెట్టాలని పెద్దాయన చెపితే మరికొందరిపై నిఘా పెట్టాలని చిన్నాయన, ఇంకొందరిపై నిఘా పెట్టాలని కేసీఆర్ కుటుంబసభ్యులు, బంధువులు అడిగారని.. ఎస్ఐబీ, టాస్క్‌ఫోర్స్‌ను దుర్వినియోగపరిచారని సీనియర్ పోలీసుఅధికారులు అంతర్గత సంభాషణల్లో పేర్కొంటున్నారు. ఇలా తెలుసుకున్న సమాచారం ఆధారంగా.. బెదిరించి రూ.కోట్ల ఎలక్టోరల్ బాండ్లు బీఆర్ఎ?సకు ఇప్పించుకున్నారన్న ఆరోపణలపైనా సమగ్ర విచారణ జరుగుతోందని వారు చెబుతున్నారు.

### అలా ఎలా నియమించారు?

"ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును రిటైర్‌అయిన తర్వాత మళ్లీ అదే సా?నంలో ఓఎ?సడీగా ఎలా నియమించారు? రిటైరైన అధికారికి ఇంటెలిజెన్స్ విభాగం బాధ్యతలు ఎందుకు అప్పగించారు? రాధాకిషన్‌రావు రిటైరైన తర్వాత కూడా ఏళ్ల తరబడి కొనసాగడానికి కారణాలేమిటి? ఇవి పోలీసు ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయాలా? లేక మీరు చెబితేనే వారు ఆదేశాలిచ్చారా?" ..తదితర ప్రశ్నలు కేసీఆర్‌కు సంధించేందుకు సిట్ అధికారులు సిద్ధమైనట్టు సమాచారం. అలాగే.. "ఫోన్ ట్యాపింగ్ నెంబర్లు మీరే సంతోష్ రావు ద్వారా కింది స్థాయి అధికారులకు పంపించారా? ట్యాపింగ్ రికార్డింగ్‌లు మీకు ఏవరి ద్వారా అందేవీ? మీరు విన్నారా? ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో మీరు బయటపెట్టిన ఆడియో రికార్డింగ్‌లు మీకు ఏవరు తెచ్చిచ్చారు? అనధికారికంగా వేలాది మంది ఫోన్లు ట్యాపింగ్ అవుతున్నాయనే విషయం మీకు తెలుసా?" అనే అంశాలపైనా సిట్




అధికారులు కేసీఆర్‌ను ప్రశ్నించవచ్చని తెలుస్తోంది. 2018 ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికలు, తర్వాత జరిగిన ఉప ఎన్నికలు, 2023లో సాధారణ ఎన్నికల్లో తాము ట్యాపింగ్ చేశామని, ఎన్నికల్లో ప్రతిపక్షపార్టీలకు అందే డబ్బు ప్రవాహాన్ని కట్టడి చేశామని, తనకు అందిన సమాచారం అంతా వీలున్నంత వరకూ ప్రభాకర్ రావు ద్వారా పెద్దాయనకు పంపించేవాడినని అప్పట్లో రాధాకిషన్‌రావు వాంగ్మూలం ఇచ్చారు. దాని ఆధారంగా కేసీఆర్‌ను ప్రశ్నించడానికి సిట్ ప్రశ్నావళి సిద్ధం చేసుకున్నట్టు సమాచారం.

# ఏఐతో ఉద్యోగాలకు పెను ముప్పు!

## వైట్ కాలర్ కొలువుల్లో భారీగా కోతలు

**న్యూఢిల్లీ, జనవరి 29:** మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని పరితపిస్తున్న భారత్ ఒకవైపు అవకాశాలు, మరోవైపు ముప్పులు పొంచివున్న నాలుగు రోడ్ల కూడలిలో నిలబడిందని జాతీయ ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. ముఖ్యంగా ప్రపంచాన్ని ఊపేస్తున్న ఏఐ విప్లవాన్ని అందిపుచ్చుకుంటే అమెరికా తర్వాత అత్యధిక ఏఐ లిటరేట్స్ ఉన్న భారతదేశం జీడీపీ పరంగా ఎక్కడికో వెళ్లిపోతుందని అంచనా వేస్తోంది. అయితే, బడాబడా కంపెనీలన్నీ ఏఐ రంగంలో లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు కుమ్మరించిన నేపథ్యంలో ఏమైనా తేడా వస్తే మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థే 2008 తరహా సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇలా జరిగే అవకాశం 10 నుంచి 20 శాతం వరకు ఉందని, దాన్ని విస్మరించలేమని చెప్పింది. అదే జరిగితే మనుగడ పోరాటంలో భాగంగా మహామహా ఐటీ కంపెనీలు పెట్టే బడ్జెట్ కోతల్లో ప్రధానంగా సమిధలయ్యేది భారతీయవైట్ కాలర్ ఉద్యోగులేనని హెచ్చరించింది. ఏఐ అమల్లోకి వచ్చిన 2022 నుంచే రొటీన్ ఉద్యోగాల కోతలు మొదలయ్యాయని, ఆర్థిక సంక్షోభం ఖాయమైతే తీవ్రత ఊహించలేని విధంగా ఉంటుందని అప్రమత్తం చేసింది. కేంద్రం ఏఐ ఆర్థిక మండలిని ఏర్పాటు చేసి, ఉద్యోగాలను కాపాడుకొనే మార్గాలను అన్వేషించాలని పిలుపునిచ్చింది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్న పరిస్థితుల్లోనూ భారత్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.4 శాతం వృద్ధిరేటు సాధిస్తుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది.ప్రభుత్వం దగ్గర దాదాపు రూ.65 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఉన్నాయని, అందులో ఈ ఏడాది ప్రవాసులు పంపిన డబ్బులే రూ.12 లక్షల కోట్లు ఉంటాయని తెలిపింది. దేశంలో ఊబకాయం అతిపెద్ద ఆరోగ్య సమస్యగా అవతరించిందని ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. అత్యంత ప్రాసెస్ చేసిన ఆహారం, కదలకుండా కూర్చోవడం కలగలిసి చిన్న పెద్దా పల్లె పట్నం తేడా లేకుండా అందర్నీ మధుమేహం, గుండె జబ్బులు, రక్తపోటు బారిన పడేట్లు చేస్తున్నాయని గణాంకాలతో ప్రస్తావించింది. అత్యంత ప్రాసెస్ చేసిన ఆహారం పదిహేనేళ్లలో 40 రెట్లు పెరిగిందని, ఊబకాయం రెండింతలు అయిందని వెల్లడించింది. పిల్లలు మెలకువగా ఉన్న సమయంలో టీవీల్లో ఫుడ్ యాడ్‌లు రాకుండా చూడాలని, నూనె, ఉప్పు, చక్కెర ఎక్కువగా వాడే ఆహారంపై సిగరెట్ల లాగా చట్టబద్ధమైన హెచ్చరికలు




పెట్టాలని సలహా ఇచ్చింది. డిజిటల్ అడిక్షన్ జాతీయ ఆరోగ్య సమస్యగా పరిణమించిందని, ఎక్కువ సేపు స్క్రీన్ చూడటం, సోషల్ మీడియా స్క్రోల్ చేయడం వల్ల యువత సామాజిక బంధాలను పూర్తిగా కోల్పోవడమే కాకుండా తెలివితేటలు కూడా దెబ్బతింటున్నాయని తెలిపింది.


## మళ్లీసమాజాన్ని వెనక్కి
# తీసుకెళ్తున్నామా?

**యూజీసీ కొత్త నిబంధనలు అస్పష్టంగా ఉన్నాయి..**

**మేం కల్పించుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయ్**

**నూతన విధివిధానాల్లో భాష సరిగా లేదు**

**యూజీసీ కొత్త నిబంధనలపై సుప్రీం స్టే**






**న్యూఢిల్లీ, జనవరి 29:** యూజీసీ తీసుకొచ్చిన కొత్త నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వాన్ని పెంపొందించేందుకంటూ యూజీసీ తెచ్చిన నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. యూజీసీ విధివిధానాలు అస్పష్టంగా ఉన్నాయని, వాటిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. కొత్త నిబంధనల వల్ల తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది. “స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని దశాబ్దాల తర్వాత దేశంలో కులవివక్ష లేని సమాజం కోసం మనం ఏం సాధించాం? ఈ విషయంలో మనం మళ్లీ సమాజాన్ని వెనక్కి తీసుకెళు_న్నామా అనే భావన కలుగుతోంది. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలు సహా దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తమ సంప్రదాయాలకు అనుగుణంగానే వ్యవహరిస్తారు. అలాంటివారిని ర్యాగింగ్ పేరుతో కొందరు అవహేళన చేస్తుండడం అత్యంత బాధాకరం. వాటిని అరికట్టేందుకు ప్రత్యేక హాస్టళ్లు ఉండాలని మాట్లాడుతున్నారు. కానీ, ప్రస్తుతం సమాజంలో కులాంతర వివాహాలే జరుగుతున్నాయి. హాస్టళ్లలోనూ అందరూ కలిసే ఉంటున్నారు. అలాగే, ఐక్య భారత విధానం మన విద్యాసంస్థల్లో స్పష్టంగా ప్రతిబింబించాలి. విద్యా సంస్థల్లో స్వేచ్ఛాయుత, సమానత్వ వాతావరణాన్ని మేం కోరుకుంటున్నాం” అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. “ఈ విషయంలో మేం జోక్యం చేసుకోకపోతే తీవ్ర పరిణామాలకు దారి తీస్తుంది. సమాజాన్ని విభజిస్తుంది. కొత్త విధివిధానాల్లో భాషే అస్పష్టంగా ఉంది. నిపుణులు పరిశీలించి, దాన్ని సరిచేయాలి” అని పేర్కొంది. ప్రతి ఉన్నత విద్యాసంస్థలోనూ ‘సమానత్వ (ఈక్విటీ) కమిటీ’ల ఏర్పాటును యూజీసీ ఇటీవల తప్పనిసరి చేసింది. ఆయా కమిటీల్లో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలని ఆదేశించింది. రోహిత్ వేముల కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ‘ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వ ప్రోత్సాహ నిబంధనలు-2012’ స్థానంలో యూజీసీ కొత్త నిబంధనలను ఈ నెల 13 నుంచి అమలులోకి తెచ్చింది. వీటిలో కులవివక్ష నిర్వచనాన్ని ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, అధ్యాపక సిబ్బందికే పరిమితం చేయడంపై తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే యూజీసీ నిబంధనలను సవాల్ చేస్తూ ఓ న్యాయవాది సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కుల ఆధారిత వివక్ష కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు వ్యతిరేకంగా మాత్రమే జరుగుతుందన్న భావన ఆధారంగా ఈ ఉత్తర్వులను యూజీసీ రూపొందించినట్లు ఉందని అందులో పేర్కొన్నారు. కులం ఆధారంగా జనరల్ లేదా నాన్ రిజర్వ్‌డ్ విభాగాల విద్యార్థులు కూడా వివక్షను ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. కులానికి తావివ్వని రీతిలో వివక్ష అనే పదాన్ని నిర్వచించేలా యూజీసీకి ఆదేశాలు ఇవ్వాలని పిల్‌లో పిటిషనర్ కోరారు. తదుపరి నోటీసులు ఇచ్చే వరకు యూజీసీ నిబంధనలపై స్టే అమల్లో ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## పుర పోరులో బీసీలకు
## 56శాతం టికెట్లివ్వాలి: జాజుల

**హైదరాబాద్, జనవరి 29**
మునిసిపల్ ఎన్నికల్లో.. బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం 56శాతం టికెట్లు కేటాయించి కాంగ్రెస్ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌లను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీల జనాభా ఎంత ఉందో అదేస్థాయిలో రిజర్వేషన్లు అమలు కావాలన్న రాహుల్ గాంధీ నినాదాన్ని తు.చ. తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. బీసీలకు 56శాతం కోటా కింద.. కనీసం 68 మునిసిపల్ చైర్మన్ పదవులను కేటాయించాలని బీసీ జేఏసీ కోరింది. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్‌లు మాట్లాడుతూ.. రాజకీయంగా బీసీలకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు పార్టీ శ్రేణులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# గద్దెపై కొలువుదీరిన సమ్మక్క..

## పోలీస్ భద్రత నడుమ గద్దెను చేరిన తల్లి...

**వన దేవతల దర్శనానికి పోటెత్తిన భక్తజనం..**

**తల్లులను దర్శించుకున్న రాష్ట్ర మంత్రి వివేక్, జిఎం రాధాకృష్ణ, పలు రాజకీయ పార్టీల నాయకులు..**





**రామకృష్ణాపూర్, జనవరి 30, (మన సమాజం):** మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్ ఆర్కే - 1 ఏ గని పాలవాగు ఒడ్డున సింగరేణి అధ్వర్యంలో జరుగుతున్న సమ్మక్క - సారలమ్మ జాతర మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతరను తలపిస్తుంది. బుధవారం సారలమ్మ గద్దెను చేరగా గురువారం సమ్మక్క గద్దెపై కొలువుదీరింది. ప్రధాన పూజారులు పోచమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పోలీస్, సింగరేణి రెస్క్యూ బృందాల భద్రత నడుమ డప్పు చప్పుళ్ళు, డీజే పాటలతో గుస్సాడి నృత్యాలు, పోతురాజు విన్యాసాలు, శివసత్తుల పునకాల నడుమ ఊరేగింపుగా భక్తులకు దర్శనమిస్తూ కుంకుమ భరణి రూపంలో అమ్మవారు గద్దెపై కొలువుదీరింది. ఇద్దరు అమ్మలు కొలువు దీరడంతో తల్లుల దర్శనానికి భక్తులు పోటెత్తారు. మందమర్రి, రామకృష్ణాపూర్ నుండి ఇతర ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులు అమ్మవార్లకు కోళ్ళు, మేకలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రక్కనే ఉన్న వన ప్రాంతంలో గుడారాలు వేసుకొని కుటుంబ సమేతంగా వన భోజనాలు చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మందమర్రి ఏరియా జిఎం రాధాకృష్ణ, ఎస్ఓటు జిఎం జిఎల్ ప్రసాద్ లతో ఏఐటియూసి రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య గుర్తింపు సంఘం నాయకులు సలేంద్ర సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి అమ్మవార్లను ధరించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి వివేక్ మాట్లాడుతూ సమ్మక్క -సారలమ్మ దీవెనలు రాష్ట్ర ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. భక్తులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించిన సింగరేణి అధికారులను అభినందించారు. చెన్నూరు నియోజకవరంలో అభివృద్ధి పనులు శరవేంగ జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందిస్తున్నామని పేర్కొన్నారు. జిఎం రాధాకృష్ణ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అని వసతులను కల్పించామన్నారు. వనదేవతలను దర్శించుకోవడానికి ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేశామని అమ్మవార్ల దర్శనానికి భక్తులు తరలివస్తున్న తీరు మేడారం జాతరను తలపించడం సంతోషంగా ఉందన్నారు. అనారోగ్య బారిన పడిన భక్తుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ మాట్లాడుతూ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చేసుకోకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. అన్ని చోట్ల సీసీ కెమెరాల నిఘా పెట్టామన్నారు. సుమారు వంద మంది పోలీస్ సిబ్బంది బంధోబస్తులో ఉన్నారని తెలిపారు. పుర ప్రముఖులు, పలు రాజకీయ పార్టీల నాయకులు వనదేవతలను దర్శించుకొని పునీతులయ్యారు..





# అమ్మాయిలను బ్లాక్‌మెయిల్ చేసే వాళ్లకు..
## పోలీసులంటే భయం పుట్టాలి

**ఆ విధంగా పోలీసుల చర్యలు ఉండాలి**

**బాధితురాలి ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదుచేయాలన్న సీఎం నిర్ణయం.. అభినందనీయం**

**ఆడపిల్లను ట్రాప్ చేసే వారికి సజ్జనార్ చర్యలే కరెక్టు**

**ఇది నా వ్యక్తిగత అభిప్రాయం: తూర్పు జగ్గారెడ్డి**



**హైదరాబాద్, జనవరి 29**
అమ్మాయిల భయాలను ఆసరాగా చేసుకుని వారిని బ్లాక్‌మెయిల్ చేసే నేరగాళ్లకు భయం కలిగేలా పోలీసుల చర్యలు ఉండాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు. ఇలాంటి ఘటనల్లో బాధితురాలి ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానన్నారు. ఈ మేరకు నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీ శివధర్‌రెడ్డి, సీపీ సజ్జనార్, సీఐడీ అధికారి చారు సిన్హాకు అభినందనలు తెలుపుకుంటున్నానన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బాధితురాలి ఇంటివద్దే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న నిర్ణయం.. ఆడపిల్లల తల్లిదండ్రులకు ఒక ఆయుధంలా మారనుందన్నారు. కొంతమంది ఆకతాయిలు ఆడపిల్లలతో ఫొటోలు దిగి.. ఆ తర్వాత వారిని బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఘటనలు ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనల్లో ఆడపిల్లల తల్లిదండ్రులు ఇచ్చే ఫిర్యాదులను బహిర్గతం చేయవద్దని పోలీసులను కోరారు. ఆ సమాచారం బహిర్గతమైతే బాధితులు.. తమ జీవితాలను బలి తీసుకునే ప్రమాదం ఉందని చెప్పారు. ట్రాప్ అయిన అమ్మాయిలు సమస్యల్లో పడకుండా కేసును పరిష్కరించాలని పోలీసులను కోరారు. కాగా, అమ్మాయిల్ని ట్రాప్ చేసి, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడే నేరగాళ్లపై చర్యలు తీసుకోవడంలో సజ్జనార్ తీరు సరైనదేనని జగ్గారెడ్డి అన్నారు. న్యాయస్థానాలు ఒప్పుకొన్నా, ఒప్పుకోకపోయినా ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని చెప్పారు. వైఎ?సఆర్ హయాంలో ఓ అమ్మాయిని సతాయించిన వాళ్లను ఎన్‌కౌంటర్ చేశారని, బీఆర్ఎస్ హయాంలోనూ ఒక ఎన్‌కౌంటర్ జరిగిందని గుర్తు చేశారు. రాజ్యాంగం వేరు.. వ్యక్తిగత అభిప్రాయం వేరని, రాజ్యాంగపరంగా ఎన్‌కౌంటర్లను సమర్థించలేమన్నారు. కానీ, కొన్ని సార్లు అలాంటి భయం ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇలాంటి కేసులకు సంబంధించి పోలీసులు సీక్రెట్ ఆపరేషన్లు చేపట్టాలని కోరారు.

## గాంధీ పథమా? లెనిన్ మార్గమా?


అహింసా ప్రవక్త మహాత్ముడు, అక్టోబర్ విప్లవ నిర్మాత లెనిన్ చింతనా ధోరణులలోని తారతమ్యాలను నిశితంగా విశ్లేషించిన, సాద ృశ్యాలను ఎత్తిచూపిన వంద సంవత్సరాల నాటి ఒక ఆసక్తికరమైన పుస్తకాన్ని నేను ఇటీవల చదివాను. 'లెనిన్ అండ్ గాంధీ' అనేది ఆ పుస్తకం శీర్షిక. గ్రంథకర్త ఆస్ట్రియన్ రచయిత, చరిత్రకారుడు రెనే ఫ్యులోప్ మిల్లర్ (1891-1963). తొలుత ఫ్రెంచ్ భాషలో ప్రచురితమైన ఈ పుస్తకం 1927లో ఆంగ్లంలోకి అనువదితమయింది. గాంధీ, లెనిన్‌లు సమకాలికులు. ఆరునెలల తేడాతో వారు ఈ ప్రపంచంలోకి ప్రవేశించారు. ఇరువురూ మధ్యతరగతి కుటుంబాలలో జన్మించారు. పేదరికం, అన్యాయాల నుంచి మానవకోటిని విముక్తం చేయాలనే ప్రగాఢ ఆకాంక్ష వారి జీవితాలను విలక్షణంగా నడిపించింది. లెనిన్ తన రచనలలో కనికరం లేని కఠిన వాదనలు చేసేవారు. గాంధీ ప్రజా జీవితంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ చాలా నాగరీకంగా వ్యవహరించేవారు. మరో ముఖ్యమైన తేడా- లెనిన్ హింసను ఆరాధించి హింసాత్మక పద్ధతులను అనుసరించారు. అహింసకు అంకితమయిన ఉదాత్తుడు గాంధీజీ. మనసా వాచా కర్మణా అహింసావాది.నాకు తెలిసినంతవరకు గాంధీ, లెనిన్‌ల భావజాలాలను తులనాత్మకంగా పరిశీలించిన తొలి రచయిత బొంబాయి కమ్యూనిస్టు శ్రీపాద్ అమ ృత్‌డాంగే (1899-1991). 1921లో ఆయన 'గాంధీ వర్సెస్ లెనిన్' అనే ఒక చిన్న పుస్తకాన్ని రాశారు. ఈ కమ్యూనిస్టు సహజంగానే గాంధీ కంటే లెనిన్ వైపే మొగ్గారు. అయితే తన స్వదేశీయుడి భావాలు, ఆలోచనల పట్ల ఆసక్తి, సానుభూతిని నిలుపుకున్నారు. 'గాంధీ, లెనిన్ సిద్ధాంతాలు ఆచరణాత్మక జీవితంలో సాకారమవ్వడం అసాధ్యం' అని డాంగే వ్యాఖ్యానించారు. డాంగే పుస్తకం వెలువడిన నాలుగు సంవత్సరాలకు హ్యారీ వార్డ్ (1873-1960) అనే అమెరికన్ మెథడిస్ట్ క్రైస్తవ పండితుడు 1925 ఏప్రిల్‌లో 'ది వరల్డ్ టుమారో' అనే జర్నల్‌లో 'లెనిన్ అండ్ గాంధీ' అనే వ్యాసాన్ని రాశారు. గాంధీ, లెనిన్ ఇరువురూ తమ మధ్యతరగతి నేపథ్యాన్ని అధిగమించి, తమ నిరాడంబర జీవనశైలుల ద్వారా సామాన్య మానవులతో తాదాత్మ్యమయ్యారని వార్డ్ పేర్కొన్నారు. వారి మధ్య వ్యత్యాసాలను వివరిస్తూ పీడకుల ఆధిపత్యాన్ని వారి హింసాత్మక పద్ధతులను మరింతగా అనుసరించడం ద్వారానే అధిగమించగలమని లెనిన్ విశ్వసించగా, ప్రత్యామ్నాయ పద్ధతులలో పీడకులపై విజయం సాధించగలమని గాంధీ భావించారు, ఆచరించారు' అని వ్యారీ వార్డ్ రాశారు. లెనిన్, గాంధీల భావాలు, ఆదర్శాలు వారి వారి దేశాల చరిత్రలను మార్చడమే కాకుండా ప్రపంచ చరిత్రను మలుపు తిప్పాయని వార్డ్ అభిప్రాయడ్డారు. 1927లో 'గాంధీ అండ్ లెనిన్'ను ప్రచురించిన రెనే మిల్లర్‌కు డాంగే, వార్డ్ రచనల గురించి తెలిసి ఉండే అవకాశం లేదు. అయితే ఆయన కూడా మొదటి ఇరువురు అభిప్రాయపడినట్టుగానే లెనిన్, గాంధీలు చరిత్ర గతిని మార్చివేశారని సునిశ్చితంగా విశ్వసించారు. రష్యాలో కార్మికులు, కర్షకుల మధ్య ద ృఢమైన, నిర్మాణాత్మక సంబంధాలను పెంపొందించేందుకు లెనిన్, భారత్‌లో హిందువులు-ముస్లింల మధ్య సామరస్య సంబంధాలను నెలకొల్పేందుకు గాంధీ అనితర సాధ్యమైన క ృషి చేశారని మిల్లర్ పేర్కొన్నారు. దోపిడీకి తావులేని వర్గరహిత సమాజాన్ని స్థాపించడమనే లక్ష్యసాధనకు హింసాత్మక పద్ధతులను అనుసరించడం మినహా మరో మార్గం లేదని లెనిన్ విశ్వసించగా, ప్రతికూల పరిస్థితులలోనూ అహింసాత్మక, ప్రేమ పద్ధతులలో గాంధీ తన వ్యక్తిగత, రాజకీయ ప్రత్యర్థులపై పోరాడి చరిత్రాత్మక ఫలితాలు సాధించారని మిల్లర్ పేర్కొన్నారు. హ్యారీ వార్డ్ వ్యాసం వెలువడిన ఒక సంవత్సరం అనంతరం, రెనే మిల్లర్ పుస్తకం ప్రచురణకు ఒక ఏడాది ముందు, అంటే 1926లో ఫిలిప్ స్ప్రాట్ (జననం 1902) అనే బ్రిటిష్ యువ కమ్యూనిస్టు భారత్‌కు వచ్చారు. ఈ దేశంలో కమ్యూనిస్టు విప్లవాన్ని పురిగొల్పడమే అతడి రాక లక్ష్యం. ఆస్ట్రియన్ మిల్లర్, అమెరికన్ వార్డ్ వలే స్ప్రాట్ రచయిత కాదు. అయితే లెనిన్ బాటలో నడిచేందుకు నిర?యించుకున్న క్రియాశీల వ్యక్తి. రెండు సంవత్సరాల పాటు భారత ఉపఖండమంతటా ఈ యువ కార్యకర్త పర్యటించారు. భారతీయ విప్లవకారులతో సంబంధాలను నెలకొల్పు కున్నారు. విప్లవ సాధ్యతకు గల అవకాశాలను చాలా నిశితంగా పరిశీలించారు. 1929 వేసవిలో స్ప్రాట్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సహచర భారతీయ కామ్రేడ్లతో పాటు అతడినీ మీరట్ కుట్రకేసులో ముద్దాయిగా కోర్టు బోనులో నిలబెట్టారు. దాదాపు ఒక దశాబ్దం పాటు స్ప్రాట్ జైలు జీవితం గడిపారు. కారాగారవాసంలో భారతదేశ చరిత్ర, తాత్విక సంప్రదాయాలు, సాహిత్యం విస్త ృతంగా అధ్యయనం చేశారు. అంతకు ముందు ఇవన్నీ అతడికి పెద్దగా అవగాహన లేని అంశాలు. ఈ ప్రగాఢ అధ్యయనం మూలంగా లెనినిస్టు భావజాలం ఒకప్పుడు తనను అనుమతించినదానికంటే ఎక్కువ సహానుభూతితో గాంధీని అర్థం చేసుకునేందుకు స్ప్రాట్ ప్రయత్నించారు. జైలు నుంచి విడుదల అయిన వెంటనే సేవాగ్రామ్ వెళ్లి గాంధీజీని దర్శించారు. అనేక అంశాలపై మహాత్ముడితో మాటా మంతీ జరిపారు. ఆ సంభాషణల స్ఫూర్తితో పాటు గాంధీజీ రచనల నిశిత అధ్యయనం ఆధారంగా ఆ మహోన్నత భారతీయుని చింతనా ధోరణి, భావ విశిష్టత గురించి **Gandhism : An Analysis**' అనే పుస్తకాన్ని స్ప్రాట్ రాశారు. లెనిన్ విప్లవ తాత్త్వికత, గాంధీ మానవతా దార్శనికత మధ్య సమన్వయం సాధించేందుకు స్ప్రాట్ ప్రయత్నించారు. 'గ్రామీణ భారతదేశంలో ప్రస్తుతం నెలకొనివున్న పరిస్థితులలో కోట్లాది ప్రజలను అనివార్యమైన దానికంటే ఒక్కరోజు పాటు అదనంగా వదిలివేసినా నేరం అవుతుంది. విదేశీ దురాక్రమణల ప్రమాదాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు రష్యన్లు మరింతగా దారిద్ర్యంలో కునారిల్లవలసి ఉన్నది. పాలనలో, సమాజ నిర్మాణంలో క్రూర పద్ధతులను అనుసరించవలసి ఉన్నది. సంప్రదాయ సోషలిజం అటువంటి ఆస్వాభావిక పాలనా పద్ధతులకు పాల్పడకుండా సంయమనం వహించగలిగితే అది తప్పకుండా ఒక అర్థ శతాబ్ది కాలంలో భారత్‌ను- అశేష జనులు మరింత సుఖసంతోషాలతో జీవించగల నెలవుగా మార్చివేయగలదు' అని ఫిలిప్ స్ప్రాట్ రాశారు.ఒక మార్క్సిస్టుగా జైలుకు వెళ్లిన ఫిలిప్ స్ప్రాట్ అస్పష్టమైన కొత్త ఆలోచనలతో స్వేఛా ప్రపంచంలోకి వచ్చారు. లెనిన్, గాంధీ భావజాలాల్లో దేనివైపు పూర్తిగా మొగ్గకుండా ఒక మధ్యేమార్గాన్ని అన్వేషిస్తూ మానవేంద్రనాథ్‌రాయ్ స్ఫూర్తి కేంద్రంగా ఉన్న మేధావుల బ ృందంలో చేరారు. లెనిన్‌కు మాజీ సహచరుడు, గాంధీ విమర్శకుడు అయిన రాయ్ రాడికల్ డెమొక్రాటిక్ పార్టీని స్థాపించారు. ఆ పార్టీ ప్రచురించే 'ఇండిపెండెంట్ ఇండియా' పత్రికకు ఆయన ప్రధాన సంపాదకుడు. 1941లో భారతీయ మహిళను వివాహం చేసుకున్న ఫిలిప్ స్ప్రాట్ బెంగళూరులో స్థిరపడ్డారు. గాంధీజీపై రాసిన ఒక వ్యాసాన్ని ఇండిపెండెంట్ ఇండియా పత్రికకు పంపించారు. అయితే గాంధీ ఆలోచనల పట్ల మితిమీరిన సానుభూతి చూపిందనే కారణంతో రాయ్ ఆ వ్యాసాన్ని ప్రచురించడానికి తిరస్కరించారు. ఆ వ్యాసం లిఖిత ప్రతి ఆనాడే కనుమరుగయింది.

# దేశ ప్రజాస్వామ్య చరిత్రే కాంగ్రెస్ చరిత్ర!



కాంగ్రెస్ పార్టీ ప్రయాణం కేవలం రాజకీయ చరిత్ర కాదు. అది త్యాగం నుంచి స్వప్నం వరకు, ఉద్యమం నుంచి పరిపాలన వరకు సాగిన భారత ప్రజాస్వామ్య గాథ. నిన్నటి పోరాటం, నేటి ఆలోచన, రేపటి ఆశ... ఈ మూడింటి మధ్య వంతెనగా కాంగ్రెస్ పార్టీ నిలిచింది. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం 1885లో ఏ.ఓ హ్యూమ్ నేత ృత్వంలో జరిగింది. ఆ రోజుల్లో ఇది ఒక సంస్కరణవాద వేదికగా ప్రారంభమైనప్పటికీ, కాలక్రమంలో భారత స్వాతంత్ర్య ఉద్యమానికి వెన్నుదన్నుగా మారింది. స్వాతంత్ర్యం కోసం సాగిన సుదీర పోరాటంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అనేక త్యాగాలు చేశారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడినందుకు వేలాదిమంది కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సంవత్సరాల తరబడి జైళ్లలో ఉన్నారు. గాంధీ, నెహ్రూ, వల్లభాయిపటేల్, రాజేంద్రప్రసాద్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి మహానేతలందరూ దీరకాల కారాగార జీవితాన్ని అనుభవించారు. ఎందరో కాంగ్రెస్ కార్యకర్తలు బ్రిటిష్ అణచివేతలో ప్రాణాలు కోల్పోయారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో ఆధునిక భారత నిర్మాణానికి పునాదులు పడ్డాయి. లౌకికత్వం, శాస్త్రీయ ద ృక్పథం, ప్రణాళికాబద్ధ ఆర్థిక అభివ ృద్ధి నెహ్రూ పాలనకు నిదర్శనాలుగా నిలిచాయి. ఆయన హయాంలో నిర్మితమైన భాఖ్రానంగల్, దామోదర్ వ్యాలీ, నాగార్జునసాగర్, హీరాకుడ్, కోసి డ్యామ్ వంటి భారీ సాగు నీటి ప్రాజెక్టులు దేశ ముఖచిత్రాన్ని మార్చివేశాయి. ఈ ప్రాజెక్టులు వ్యవసాయాన్ని స్థిరపరిచి ఆహార భద్రతకు దారి తీశాయి. ఇందిరాగాంధీ పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రాత్మక, విప్లవాత్మక నిర?యాలు తీసుకున్నది. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని రైతులు, పట్టణాల్లో నిరుద్యోగులు సమస్యలతో తల్లడిల్లారు. ఆహారం, విద్య, వైద్య వ్యవస్థలు అభివ ృద్ధి చెందలేదు. ఆర్థిక వ ృద్ధి ఉన్నా, దాని లాభాలు పేదలకు చేరలేదు. బ్యాంకులు, పరిశ్రమలు, భూములు, సంపద కొద్దిమంది చేతుల్లోనే ఉండేవి. ఈ అసమానతను తొలగించాలన్న ఆలోచనతోనే 'గరీబీ హటావో' నినాదాన్ని ఇందిరాగాంధీ దేశవ్యాప్తంగా తీసుకెళ్లారు. పేదలకు రుణాలు దొరకని పరిస్థితిని మార్చాలని సంకల్పించారు. బ్యాంకుల జాతీయీకరణ చేసి పేదలకు రుణాలు, సబ్సిడీలు వంటి చర్యలకు సిద్ధమయ్యారు. ఇందిరా హయంలోనే రాజస్థాన్ ఎడారిని పచ్చగా మార్చిన ఉకాయ్ డ్యామ్, జయక్వాడి నిర్మితం అయ్యాయి. రాజీవ్‌గాంధీ భారత రాజకీయాల్లో సాంకేతిక ద ృక్పథాన్ని ప్రవేశపెట్టారు. కంప్యూటరీకరణ, టెలికాం విస్తరణ వంటి నిర?యాలు నేటి డిజిటల్ భారతానికి పునాదులయ్యాయి. విదేశీ టెక్నాలజీ అంటే వ్యతిరేక భావన ఉన్న సమయంలో రాజీవ్‌గాంధీ కంప్యూటర్ల ప్రవేశానికి ధైర్యంగా మద్దతు ఇచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, రైల్వే, ఎయిర్‌లైన్స్‌లో కంప్యూటరీకరణకు బాటలు వేశారు. టెలిఫోన్ కమ్యూనికేషన్‌ను విస్తరించారు. ఎస్టీడీ, ఐఎస్డీ సేవలతో గ్రామీణ ప్రాంతాలకు టెలికాం సేవలు వేగంగా పెరిగాయి. సాఫ్ట్‌వేర్ రంగానికి ప్రోత్సాహం ఇచ్చారు. సాఫ్ట్‌వేర్ ఎగుమతులను ప్రోత్సహించి యువతకు ఐటీ విద్యను దగ్గర చేశారు. ముఖ్యంగా పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగ హోదా కల్పించే 73వ, 74వ సవరణలు స్థానిక స్వయంపాలనకు కొత్త శక్తిని ఇచ్చాయి. రాజీవ్‌గాంధీ కాలంలో ఎన్నో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలూ మొదలయ్యాయి. మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా యూపీఏ-1, యూపీఏ-2 పాలనల్లో విప్లవాత్మక నిర?యాలు తీసుకున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (**MGNREGA**-2005) గ్రామీణ పేదలకు పనిచేసే హక్కును, ప్రతి కుటుంబానికి సంవత్సరానికి వంద రోజుల ఉపాధి హామీని కల్పించింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేసింది. యూపీఏ పాలనతోనే సమాచార హక్కు చట్టం (RTI-2005) పౌరులకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును కల్పించింది. విద్యాహక్కు చట్టం (**RTE**-2009) 6 నుంచి 14 ఏళ్ల పిల్లలకు ఉచిత, తప్పనిసరి విద్యను మౌలిక హక్కుగా మార్చింది. ఆహార భద్రత చట్టం (**NFSA**--2013) పేదలకు తక్కువ ధరలకు ఆహార ధాన్యాలు లభించేలా చేసి, కోట్లాది కుటుంబాలకు ఆహార భరోసాను కల్పించింది. అటవీ హక్కుల చట్టం (2006) అడవుల్లో నివసించే గిరిజనులకు భూమిపై, వనరులపై హక్కులు కల్పించింది. భూమి సేకరణ చట్టం (2013)- భూమి సేకరణలో రైతులకు న్యాయమైన పరిహారాన్ని తప్పనిసరి చేసింది. యూపీఏ ప్రభుత్వం మహిళల స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహాన్ని ఇచ్చింది. సామాజిక సంక్షేమ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యం కల్పించింది. ప్రపంచ ఆర్థిక మాంద్యం (2008) సమయంలో భారత ఆర్థిక వ్యవస్థను స్థిరంగా నడపగలిగింది. సంక్షేమంంవ ృద్ధిసమతుల్య అభివ ృద్ధి నమూనా ముందుకు సాగింది. న్యూక్లియర్ ఒప్పందం (భారత్-అమెరికా పౌర అణు ఒప్పందం) అంతర్జాతీయంగా భారతదేశానికి మంచి గుర్తింపు తీసుకొచ్చింది. సంక్షేమ పథకాల లీకేజీల తగ్గింపు లక్ష్యంగా పౌరుల గుర్తింపు వ్యవస్థ ఆధార్ కార్డును తీసుకొచ్చింది. ఇందుకు భిన్నంగా గత పదకొండేళ్లుగా కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నది. ప్రభుత్వరంగ సంస్థలైన ఎయిర్‌పోర్టులు, పోర్టులు, బొగ్గు గనులు, జాతీయ రహదారులను ప్రైవేటు పరం చేస్తున్నది. ఉపాధి హామీ చట్టంలో మహాత్మాగాంధీ పేరు తొలగించి 'జీ-రామ్ జీ' అని పేరును, ఆ చట్టంలో నిబంధనలు మార్చి, ఆ చట్టాన్ని దాదాపు నిర్వీర్యం చేసింది. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నది. మరోపక్క రూపాయి మారకం విలువ రోజురోజుకు పడిపోతున్నది. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయి. నోట్ల రద్దు, జీఎస్టీతో ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. దేశంలో మతం పేరుతో నిత్య దాడులు పెట్రేగిపోతున్నాయి. గత దశాబ్ద కాలంలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు అయినా నిర్మించలేదు. కాంగ్రెస్ హయాంలో ఎన్నో ఐఐటీ, ఐఐఎం వంటి అత్యున్నత విద్యా సంస్థలు మేథో వనరులను స ృష్టించి దేశాన్ని విజ్ఞాన ఆధారిత దేశంగా తీర్చిదిద్దాయి. కానీ బీజేపీ హయాంలో ఎన్ని కేంద్రీయ విద్యా సంస్థలు, ఎన్ని విశ్వవిద్యాలయాలు ప్రారంభమయ్యాయో లెక్క చూస్తే నిరాశ కలుగుతుంది. ఇలాంటి పనులు గాలికి వదిలి, రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను విఛిన్నం చేసి, ప్రభుత్వాలను కూలగొట్టే పని మీద ఎక్కువ ద ృష్టి పెట్టారు. ఓట్ చోరీతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరకు వచ్చాయి. మళ్ళీ మా నాయకుడు రాహుల్‌గాంధీ నాయ కత్వంలో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం. అందుకు తెలంగాణ నుంచి బీజం పడింది. రాష్ట్రంలోని ప్రజాపాలన దేశానికే ఆదర్శంగా నడుస్తున్నది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పుంజుకొని మళ్ళీ కేంద్రంలో అధికారాన్ని చేపట్టి ప్రజల ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరుస్తుంది.

## జీలకర్ర నీళ్లను రోజూ పరగడుపున తాగితే
# ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా..?



మన వంటింట్లో ఉండే మసాలా దినుసుల్లో జీలకర్ర కూడా ఒకటి. భారతీయ వంటకాల్లో జీలకర్ర ముఖ్యపాత్ర పోషిస్తుందని చెప్పవచ్చు. దాదాపు మనం చేసే అన్ని వంటకాల్లో జీలకర్రను వాడుతూ ఉంటాం. వంటలకు చక్కటి రుచి తీసుకు రావడంలో జీలకర్ర పాత్ర ఎంతో ఉంది. జీలకర్రలో ఔషధ గుణాలతో పాటు మన శరీరానికి అవసరమయ్యే పొటాషియం, క్యాల్షియం, సెలీనియం, రాగి, మాంగనీస్ వంటి పోషకాలు కూడా ఎన్నో ఉన్నాయి. జీలకర్రను తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. అనేక రకాల అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం కలుగుతుంది. జీలకర్రను ఆహారంలో భాగంగా తీసుకోవడమే కాకుండా జీలకర్ర నీటిని తాగడం వల్ల కూడా మన ఆరోగ్యానికి మేలు కలుగుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా పరగడుపున ఈ నీటిని తాగడం వల్ల మనం మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చని వారు అంటున్నారు.

**రక్తహీనతకు చెక్..**

జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో జీవక్రియ పెరుగుతుంది. తద్వారా శరీరంలో పేరుకుపోయిన కొవ్వు కరగడంతోపాటు శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది. బరువు తగ్గాలనుకునే వారు జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల వేగంగా బరువు తగ్గుతారు. జీలకర్ర నీటిని తాగడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. తరుచూ ఇన్ఫెక్షన్ ల బారిన పడే వారు జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. రక్తహీనతను తగ్గించడంలో కూడా జీలకర్ర నీరు మనకు సహాయపడుతుంది. జీలకర్రలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తహీనతను తగ్గించడంలో సహాయపడుతుంది. ఐరన్ తక్కువగా ఉన్నవారు, హిమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉన్నవారు రోజూ జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల ఎంతో మేలు కలుగుతుంది.

**కొలెస్ట్రాల్ తగ్గేందుకు..**

జీలకర్ర జీర ఎంజైమ్ లను ప్రేరేపిస్తుంది. జీలకర్ర నీటిని తాగడంవల్ల జీరక్రియ మెరుగుపడుతుంది. అజీర్తి, గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. చక్కటి పొట్ట ఆరోగ్యానికి జీలకర్ర నీరు ఎంతో దోహదపడతాయి. జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. ట్రైగ్లిజరాయిడ్ స్థాయిలు కూడా తగ్గుతాయి. మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. అధిక కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడే వారికి జీలకర్ర నీరు ఎంతో మేలు చేస్తుంది. రక్తపోటుతో బాధపడే వారికి కూడా జీలకర్ర నీరు మేలు చేస్తాయి. జీలకర్ర నీటిలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తపోటును అదుపులో ఉంచడంలో సహాయపడుతుంది.

**లివర్, కిడ్నీల ఆరోగ్యానికి..**

జీలకర్ర నీరు డిటాక్స్ డ్రింక్ గా కూడా పనిచేస్తాయి. ఈ నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో వ్యర్థాలు తొలగిపోతాయి. కాలేయం, మూత్రపిండాల ఆరోగ్యం మెరుగుపడుతుంది. జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. అంతేకాకుండా రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. ఈ విధంగా జీలకర్ర నీరు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ నీటిని ఉదయం పరగడుపున తీసుకోవడం వల్ల మనం మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఇక ఈ నీటిని మనం రెండు విధాలుగా తయారు చేసి తీసుకోవచ్చు. ఒక గ్లాస్ నీటిలో ఒక టీ స్పూన్ జీలకర్ర వేసి రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే వడకట్టి తీసుకోవచ్చు. అలాగే ఒక గ్లాస్ నీటిలో ఒక టీస్పూన్ జీలకర్ర వేసి బాగా మరిగించి వడకట్టి తాగవచ్చు.



## నా పెళ్లిపై అసత్య ప్రచారలెందుకు?

### నటి మెహరిన్ ఘాటు వ్యాఖ్యలు

తన పెళ్లి వార్తలపై అసత్య కథనాలపై నటి మెహరిన్ తీవ్రంగా స్పందించారు. తన పెళ్లంటూ ఆర్టికల్ రాసిన ఓ మీడియా సంస్థపై నటి మెహరీన్ అసహనం వ్యక్తంచేశారు. గత రెండేళ్లుగా ఇలాంటి వ్యవహారాలపై మౌనంగా ఉన్నా, ఇప్పుడు మాట్లాడక తప్పడం లేదన్నారు. నేను ఎవరినీ వివాహం చేసుకోలేదు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు ప్రపంచానికి చెబుతా.. అంతేగానీ తన పెళ్లి గురించి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. హరియాణాకు చెందిన భవ్యా బిష్ణోయ్‌తో మెహరీన్ నిశ్చితార్థం జరిగినా అనివార్య కారణాల వల్ల పెళ్లి రద్దు అయింది. 2022లో వచ్చిన 'ఎఫ్ 3' తర్వాత ఆమె నటించిన తెలుగు సినిమా 'స్పార్క్'. కోలీవుడ్‌లోనూ ఒక్క సినిమాలోనే (ఇంద్ర) నటించారు. ప్రస్తుతం కన్నడలో ఓ చిత్రం చేస్తున్నారు. కెరీర్‌లో గ్యాప్‌పై ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. గ్యాప్ కావాలని తీసుకోలేదని, 'ఎఫ్ 3' తర్వాత చేసిన 'సుల్తాన్ ఆఫ్ దిల్లీ' వెబ్‌సిరీస్ కోసం ఎక్కువ సమయం కేటాయించానని తెలిపారు.

## హైప్ పెంచుతున్న మాస్టర్ మహేంద్రన్ వసుదేవసుతం టీజర్



దేవి సినిమాతో చైల్డ్ యాక్టర్‌గా సూపర్ క్రేజ్ సంపాదించుకున్నాడు మాస్టర్ మహేంద్రన్. ఈ టాలెంటెడ్ యాక్టర్ హీరోగా నటిస్తున్న చిత్రం వసుదేవసుతం. వైకుంఠ్ బోను డైరెక్ట్ చేస్తున్నాడు. టాలీవుడ్ యాక్టర్ సత్యదేవ్ ఈ మూవీ టీజర్‌ను లాంచ్ చేశాడు. ఈ కథ ధర్మానికి అడ్డొస్తే మేనమామ అయినా.. లక్షల బంధుగణమైనా.. ఎదురుగా కోట్ల సాయుధులే ఉన్నా.. ధర్మ హింస తథైవచ అన్న శ్రీ కృష్ణుడిదే కాదు.. ధర్మాన్ని కాపాడేందుకు ఎంతటి మారణ హోమానికైనా ఎదురెళ్లే యువకుడిది అంటూ సాగుతున్న డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. గుడి, గుప్త నిధి చుట్టూ తిరిగే సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో సినిమా సాగనున్నట్టు టీజర్‌తో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. ఈ చిత్రంలో రాజీవ్ కనకాల, జాన్ విజయ్, మీమ్‌గోపి, తులసి, టార్జన్, రామరాజు, భద్రమ్, జబర్దస్త్ రాంప్రసాద్, శివన్నారాయణ, దువ్వాసి మోహన్, సుమేత బజాజ్, అంబికావాణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్ గా నిలువబోతున్నట్టు టీజర్ ద్వారా తెలిసిపోతుంది. ఈ మూవీ రిలీజ్ డేట్‌పై త్వరలోనే క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. ఈ చిత్రాన్ని రెయిన్‌బో సినిమాస్ బ్యానర్‌పై ధనలక్ష్మి బాదర్ల నిర్మిస్తున్నారు.



## అన్నీ ఇక్కడే నేర్చుకున్నా!

'మనస్సినక్కరే' (2003) అనే మలయాళ చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసింది అగ్ర కథానాయిక నయనతార. ఆ తర్వాత తమిళ, తెలుగు భాషల్లో అగ్ర కథానాయికగా పేరు తెచ్చుకుంది. ముఖ్యంగా 'చంద్రముఖి' 'గజిని' చిత్రాలు ఆమె కెరీర్‌ను మలుపుతిప్పాయి. ఇక అక్కడి నుంచి దక్షిణాదిలో అగ్ర నాయికగా చెలామణీ అయింది. అభిమానులు ఆమెను లేడీసూపర్‌స్టార్ అని ప్రేమగా పిలుస్తుంటారు. నయనతార ఇండస్ట్రీకి వచ్చి నేటితో 22 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఈ భామ అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ ఓ నోట్‌ను విడుదల చేసింది. 'నేను కెమెరా ముందుకొచ్చి 22ఏండ్లు గడచిపోయాయి. ఈ ప్రయాణం ఇంతదూరం సాగుతుందని అస్సలు ఊహించలేదు. ఇండస్టీకి వచ్చిన తర్వాతే వృత్తిపరంగా, వ్యక్తిగతంగా పరిణితి లభించింది. ఇక్కడే ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నా. ఓ రకంగా సినీరంగం నాలో ధైర్యాన్ని నింపింది. నన్ను కొత్తగా పరిచయం చేసింది. ఈ ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన అభిమానులందరికి కృతజ్ఞతలు' అని నయనతార పేర్కొంది.

## ఆ చాన్స్ వస్తే బాగుంటది!

'సాధారణంగా ఇద్దరమ్మాయిలు, ఓ అబ్బాయి అంటే ముక్కోణపు ప్రేమకథ అనుకుంటారు. కానీ ఈ సినిమాలో ఓ యూనిక్ పాయింట్ ఉంటుంది. అదేంటో ఇప్పుడే చెప్పకూడదు. సినిమా చూసి తెలుసుకోవాల్సిందే' అని చెప్పింది శ్రీనిధి శెట్టి. ఆమె సిద్ధు జొన్నలగడ్డ సరసన ఓ నాయికగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసుకదా' ఈ నెల 17న విడుదలకానుంది. నీరజా కోన దర్శకురాలు. ఈ సందర్భంగా గురువారం పాత్రికేయులతో ముచ్చటించింది శ్రీనిధిశెట్టి. యాక్షన్, రక్తపాతం ఉన్న కేజీఎఫ్, హిట్-3 వంటి చిత్రాల తర్వాత ఓ ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ చేయడం సరికొత్త అనుభూతి అని చెప్పింది. ఈ సినిమాలో తాను రాగ అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, తన క్యారెక్టర్‌లో కొంచెం గ్రేషేడ్స్ కనిపిస్తాయని తెలిపింది. 'ఈ సినిమాలోని కొత్త పాయింట్ ప్రతీ ఒక్కరిని సర్‌ప్రైజ్ చేస్తుంది. లవ్, ఎమోషన్స్, కామెడీ.. ఇలా అన్ని అంశాల కలబోతగా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది. సిద్ధు జొన్నలగడ్డకు సినిమాకు సంబంధించిన ప్రతి క్రాఫ్ట్‌పై అవగాహన ఉంది. ఆయన టైమింగ్ బాగుంటుంది. ఇక రాశీఖన్నా క్రమశిక్షణ కలిగిన నటి. తన ఆహారపు అలవాట్లు, వర్కవుట్స్ అన్నీ పద్ధతిగా ఉంటాయి' అని శ్రీనిధి శెట్టి పేర్కొంది. వెంకటేష్-త్రివిక్రమ్ సినిమా కథానాయికగా ఎంపికయ్యారనే వార్తలపై స్పందిస్తూ 'నిజంగా ఆ విషయం నాకు తెలియదు. ఆ సినిమా ఛాన్స్ రావాలని కోరుకుంటున్నా.

